క్లుప్తంగా

పేదలకు అన్నదానం



పోరుమామిళ్ల : స్థానిక రామాయపల్లె ఎస్టీ కాలనీలోని పేదలకు ఆదివారం వివేకానంద ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ తాటిమట్ల శ్యామల వర్ధంతిని పురస్కరించుకుని కూతురు జ్యోతి అన్నదానం చేశారు. కార్యక్రమంలో వివేకానంద సేవా శ్రమం నిర్వాహకురాలు రామతులసి, సంస్థ ప్రతినిధులు శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, ప్రసన్న, ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు అన్నవరంలో వైద్య శిబిరం

చాపాడు : మండల పరిధిలోని అన్నవరం గ్రామంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మండల వైద్యాధికారి డాక్టర్ రాజేష్ కుమార్ తెలిపారు. గ్రామంలో ఉదయం 9.30గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకూ నిర్వహించే వైద్య శిబిరంలో అన్ని రకాలైన వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేస్తామని, అవకాశాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి కోరారు.

6, 8 తేదీల్లో ప్రత్యేక సదరం శిబిరాలు

మైదుకూరు : మైదుకూరులోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (ప్రభుత్వాస్పత్రి)లో ఈనెల 6, 8 తేదీల్లో ప్రత్యేక సదరం శిబిరాలను నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ వై.రంగస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. సచివాలయంలో స్లాట్ నమోదు అవసరం లేకుండా నేరుగా ఈ శిబిరాల్లో వైద్యులు పరీక్షించి వైకల్య ధ్రువీకరణ పత్రాలను అందజేస్తారని కమిషనర్ పేర్కొన్నారు. మైదుకూరు ప్రభుతాస్పత్రిలో అవయవాల వైకల్యంపై వైద్యులు పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. అభ్యర్థులు తమ ఆధార్ కార్డు, రేషన్ కార్డు, మెడికల్ రిపోర్టులు తీసుకుని రావాలని సూచించారు.


ప్రొద్దుటూరులో..

ప్రొద్దుటూరు : స్థానిక జిల్లా ప్రభుత్వాస్పత్రిలో ప్రత్యేక సదరం శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నజీర్ అహ్మద్ తెలిపారు. ఈనెల 4, 5, 8 తేదీల్లో ఆర్థోపెడిక్, వినికిడి, దృశ్యలోపం గల వారికి సచివాలయంలో స్లాట్ నమోదు అవసరం లేకుండా నేరుగా ఈ శిబిరాల్లో వైద్యులు పరీక్షించి వైకల్య ధ్రువీకరణ పత్రాలను అందిస్తారని ఆయన పేర్కొన్నారు. అభ్యర్థులు తమ ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, మెడికల్ రిపోర్టులు తీసుకుని వెళ్లాలని సూచించారు.

269 కొత్త పింఛన్లు మంజూరు

రాజుపాళెం : మండలంలోని గ్రామాల్లో అర్హత ఉన్న వారందరికి కొత్తగా 269 పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీఓ సయ్యదున్నీసా ఒక ప్రకటనలో తెలిపారు. వాటిని ఆయా గ్రామాల్లోని వలంటీర్లు లబ్ధిదారులకు అందిస్తున్నారని చెప్పారు. ఇప్పటివరకు మండల వ్యాప్తంగా 4791 వివిధ రకాల పింఛన్లను పంపిణీ చేస్తున్నామని ఆమె వివరించారు.

హైదరాబాద్ వెళ్లి పింఛన్ అందజేత



హైదరాబాద్‌కు వెళ్లి నాగమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సురేష్

కాశినాయన : మండలంలోని వద్దమాను గ్రామానికి చెందిన మురుకూటి నాగమ్మ అనే పింఛన్ లబ్ధిదారురాలు రెండు నెలలుగా హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. ఈ నేపథ్యంలో స్థానిక వలంటీర్ సురేష్ హైదరాబాద్ వెళ్లి ఆదివారం నాగమ్మకు పింఛన్ అందజేశారు. వలంటీర్‌ను స్థానిక గ్రామస్తులు, సచివాలయ సిబ్బంది అభినందించారు.

ప్రొద్దుటూరు రూరల్ సీఐగా రమణారెడ్డి



ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరు రూరల్ సీఐగా కె.రమణారెడ్డి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. 2009 బ్యాచ్‌కు చెందిన ఆయన అనంతపురం జిల్లాలో పనిచేస్తూ ప్రొద్దుటూరుకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రూరల్ పరిధిలోని గ్రామాల్లో ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకుంటానని చెప్పారు. ఏవైనా సమస్యలుంటే ప్రజలు నేరుగా పోలీస్ స్టేషన్‌కు రావాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటానని తెలిపారు.

నేటి నుంచి బీటెక్ ఫస్ట్ ఇయర్ తరగతులు ప్రారంభం

కడప ఎడ్యుకేషన్ : కడప కేఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి బీటెక్ మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులకు తరగతులు ఈనెల 4వ తేదీ సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. విద్యార్థులు తమ తల్లిదండ్రులతో హాజరు కావాలని కళాశాల ప్రిన్సిపాల్ వీఎస్ఎస్‌మూర్తి తెలిపారు.

ప్రతి గడపకూ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే డాక్టర్ సుధ



సుమిత్రానగర్‌లో లబ్ధిదారురాలికి సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ : కులం, మతం, పార్టీ చూడకుండా అర్హతే ప్రామాణికంగా ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులో గల ముబారక్‌నగర్, సుమిత్రానగర్‌లలో ఆదివారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి వార్డులోని ప్రతి గడపను సందర్శించారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను, ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరిస్తూ ముందుకు సాగారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల గుండెల్లో నిలిచిపోయారన్నారు. అర్హులై ఉండి సాంకేతిక కారణాలతో సంక్షేమ పథకాలకు నోచుకోని వారిని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గుర్తించి వారికి కూడా సంక్షేమ పథకాలు అందజేస్తామని తెలిపారు. రాష్ట్రాభివృద్ధి కోసం, పేదల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి యద్దారెడ్డి, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ అల్లాబకాష్, కౌన్సిలర్లు హుస్సేన్‌బీ, సత్యం, ఓబుల్‌రెడ్డి, రవితేజ, కరిముల్లా, ఆయా వార్డుల ఇన్‌చార్జిలు సరిటాల మౌలాలి, షఫి, గురివిరెడ్డి, బాబు, రజనీకాంత్, మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి, వివిధశాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మడువంకపై రాకపోకలు బంద్



రాజుపాళెం- వెంగలాయపల్లె రహదారి మధ్యలో రోడ్డుపై వరద నీరు



రాజుపాళెం : పత్తి పంటలో నిలిచిన వర్షపు నీరు

రాజుపాళెం : పైతట్టు ప్రాంతాలైన పెద్దముడియం, జమ్మలమడుగు మండలాల్లో కురిసిన వర్షం నీటితో పాటు రాజుపాళెం మండలంలో ఆదివారం తెల్లవారు జామున కురిసిన వర్షం నీరు రహదారిపై ఉధృతంగా ప్రవహించింది. దీంతో ప్రొద్దుటూరు – ఆళ్లగడ్డ ప్రధాన రహదారిలో రాజుపాళెం – వెంగళాయపల్లె గ్రామాల మధ్యలో, రాజుపాళెం – అయ్యవారిపల్లె గ్రామాల మధ్యలో ఉన్న మడువంక వద్ద ఉన్న లోలెవెల్ కాజ్‌వేపై వర్షం నీరు నాలుగు అడుగుల మేర ఉధృతంగా ప్రవహించింది. ఆ నీటిలో ఎలాంటి వాహనాలు పోకుండా ఎస్ఐ రాజగోపాల్ ఆధ్వర్యంలో ఏఎస్ఐ సుబ్బారెడ్డి పర్యవేక్షణలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఆ దారిలో తిరిగే వాహనాలు తొండలదిన్నె మీదుగా పెద్దజొన్నవరం నుంచి జాతీయ రహదారి మీదుగా చాగలమర్రి, ఆళ్లగడ్డకు వెళ్లాయి. మండల వ్యాప్తంగా 64.2 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో పత్తి, జొన్న, మినుము, పసుపు, వరి, సోయాబీన్ పంటలు నీట మునిగాయి. పొలాల్లో నీరు నిలిచే వర్షం పడటంతో రైతులంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వర్షంతో పంట పైర్లకు ఊపిరి



రాజకొట్టాలు వద్ద పంట పొలాల్లో నిలిచిన వర్షపు నీరు



కేసీ కాలువలో పారుతున్న పొలాల్లో నుంచి వచ్చిన వర్షపు నీరు

చాపాడు : మండల వ్యాప్తంగా శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకూ 92.2 మిల్లీ మీటర్ల భారీ వర్షం కురిసింది. ఇదే క్రమంలో ఆదివారం సాయంత్రం నుంచి కూడా పెద్ద ఎత్తున వర్షం కురిసింది. ఈ జోరు వర్షంతో పంట పొలాలు పదునెక్కగా.. ఇప్పటికే మండే ఎండలు కాస్తుండటంతో దెబ్బతిన్న పలు రకాలైన పైర్లు ఊపిరి పోసుకున్నాయి. దీంతో వరి సాగు చేసుకునేందుకు ఎదురు చూస్తున్న రైతాంగానికి ఈ వర్షం వరంలా మారింది. మొన్నటి వరకూ బోర్లలో ఇంకిపోయిన నీటి మట్టాలు ఒక్క సారిగా పెరగగా, కుందూనదిలో వరద నీటితో పారుతుండగా రైతులు సాగుకు సన్నద్ధమవుతున్నారు. పొలాల నిండిన వర్షపు నీరు కేసీ కాలువల్లోకి చేరింది. ఇటీవల వారం రోజుల్లో ఒక వైపు ఎండలు వేసవిని తలపించేలా కాయకగా.. మరో వైపు అప్రకటిత విద్యుత్ కోతలతో అల్లాడిపోయిన జన జీవనానికి ఈ భారీ వర్షం ఉప శమనం కలిగించింది. ఆదివారం సాయంత్రం అన్నవరం వద్ద గల కుందూనది వంతెన పైకి వరద నీరు చేరింది. మరో మూడు రోజుల పాటు వర్షాలు ఉండటంతో ప్రజలతో పాటు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వరాల తల్లి ఆరోగ్యమాత



దైవ సందేశం అందజేస్తున్న గురువు

కడప కల్చరల్ : మరియ తల్లి తనను అడిగిన వారందరికీ అభయహస్తం అందిస్తూ వరాల తల్లిగా కడపలో కొలువై ఉన్నారని, అందరూ ఆ తల్లిని దర్శించి కలలను సాకారం చేసుకోవాలని చిత్తూరు మల్టీ సోషల్ సర్వీస్ సొసైటీ డైరెక్టర్, రెవరండ్ ఫాదర్ గడికోట మనోహర్ తెలిపారు. కడప నగరం రైల్వేస్టేషన్ వద్దగల ఆరోగ్యమాత చర్చి నవదిన ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజు ఫాదర్ సూసై నాదస్ మైఖేల్ దివ్యబలి పూజను సమర్పించగా, మనోహర్ దివ్య సందేశాన్ని అందించారు. ఈ సందర్భంగా ఫాదర్‌మైఖేల్ మాట్లాడుతూ మన ఆశలకు స్పందించి అడగకముందే వరాలిచ్చే తల్లి మన సమీపంలోనే ఉందని, ఆమెను దర్శించి ఆమె దివ్య సన్నిధిలో తరించాలని సూచించారు. ఆమె వరాలిచ్చే తల్లి అని, అందుకు నిదర్శనమే ఈరోజు వందలాది మంది విశ్వాసులు తమ కృతజ్ఞతగా దివ్యబలి పూజ, కానుకలు సమర్పించి సేవా కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. ప్రార్థనకు ముందు ప్రత్యేకంగా అలంకరించబడిన ఆరోగ్యమాత స్వరూపాన్ని తేరుపై ఉంచి ఆ క్షేత్ర ప్రాంగణంలో ఊరేగింపు నిర్వహించారు. విశ్వాసులు భక్తి గీతాలను ఆలపిస్తూ ఆరోగ్యమాత నామ జపంతో కార్యక్రమంలో పాల్గొన్నారు. పాటలు, తేరు, దివ్య దివ్యబలి పీఠం అలంకరణ రేణిగుంట విచారణ గాయక బృందం నిర్వహించింది. దివ్యపూజ బలి అనంతరం, పూజను, సందేశాన్ని అందించిన గురువులకు శాలువా, పూలమాల, పుష్పగుచ్ఛం, శాంతి సేవా సొసైటీ జ్ఞాపిక, అరులయ్య కరుణయ్య పుస్తకంతో వారిని చర్చి పెద్దలు సత్కరించారు. ఈ కార్యక్రమంలో పుణ్యక్షేత్ర డైరెక్టర్ ఫాదర్ ఎండి ప్రసాదరావు, సహాయ డైరెక్టర్ ఫాదర్ విల్సన్, ప్రకాష్ రెడ్డి, మర్రెడ్డి, జయరాజు, విజయ్, సౌజన్య, స్వరూప రాణి, ఏంజెలినా, రీటా, మేరీ టీచర్, శ్యామల పాల్గొన్నారు.

ఎందరికో స్ఫూర్తినిచ్చిన సీతారామయ్య



సిద్దవటం సీతారామయ్యను సత్కరిస్తున్న శిష్యులు

కడప కల్చరల్ : జిల్లాలో స్వయం కృషితో అంచెలంచెలుగా ఎదిగి ఎందరో నిరుపేదలకు సైతం విద్యను అందుకోవడం సులభతరం చేసిన సీతారామయ్య వారందరికీ స్ఫూర్తినిచ్చారని యోగి వేమన విశ్వవిద్యాలయం లలిత కళలవిభాగం హెచ్ఓడీ కోటా మృత్యుంజయరావు అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం ముందస్తు వేడుకల్లో భాగంగా ఆదివారం జిల్లాలోని సీనియర్ ఉపాధ్యాయులు సిద్దవటం సీతారామయ్యను లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య అధ్యక్షుడు పోతుల వెంకట్రామిరెడ్డి తదితరులతో కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మృత్యుంజయరావు మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో జన్మించి స్వయం కృషితో ఉన్నత విద్యను అభ్యసించిన సీతారామయ్య శిష్యులు నేడు ప్రపంచ వ్యాప్తంగా ఉన్నారన్నారు. ఎందరికో స్ఫూర్తినిచ్చిన ఆయన శిష్యులు కూడా వేల సంఖ్యలో నేడు తమ శిష్యులకు విద్యాబోధన చేస్తుండడం విశేషమన్నారు. లయన్ పోతుల వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ సీతారామయ్య వద్ద చదువుకున్న తన బిడ్డలు నేడు ఉన్నత స్థానాల్లో ఉన్నారని, ఆ పుణ్యం ఆయనకే చెందాలన్నారు. రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్ధన్‌రాజు మాట్లాడుతూ జిల్లా పర్యాటక ప్రచారాన్ని భుజానికెత్తుకోవడంతోనే నేడు జిల్లా ప్రపంచ పర్యాటక రంగంలో ఉన్నత స్థానంలో ఉందన్నారు. ఈ సందర్భంగా వారు సీతారామయ్యను నూతన వస్త్రాలు, జ్ఞాపికలతో సంప్రదాయబద్ధంగా సత్కరించి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో లయన్ పద్మప్రియ చంద్రారెడ్డి, లయన్ బోగా ల కొండారెడ్డి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఫెడరల్ స్ఫూర్తికి విఘాతం కలగకుండా ఎన్నికలు



కరపత్రాలను విడుదల చేస్తున్న అఖిల భారత అభ్యుదయ వేదిక నాయకులు

కడప ఎడ్యుకేషన్ : దేశ ఫెడరల్ స్ఫూర్తికి విఘాతం కలగకుండా ఎన్నికలను నిర్వహించాలని, నైష్పత్తిక ప్రాతినిధ్య విధానాన్ని అమలు చేయాలని అఖిల భారత అభ్యుదయ వేదిక రాష్ట్ర నాయకులు సురేష్ బాబు, మహబూబ్‌బాషాలు పేర్కొన్నారు. ఆదివారం కడప ఎస్టీయూ భవన్‌లో అఖిల భారత అభ్యుదయ వేదిక కడప జిల్లాశాఖ ఆధ్వర్యంలో భారత ప్రజాస్వామ్యం- జమిలి ఎన్నికలు అనే అంశంపై చర్చావేదిక జరిగింది. ఈ సందర్భంగా అభ్యుదయ వేదిక జిల్లా అధ్యక్షుడు విశ్వనాథ్ మాట్లాడుతూ భారతదేశ ప్రజాస్వామ్యానికి ప్రాణప్రదం అయిన ఎన్నికల నిర్వహణలో అనవసరమైన ప్రయోగాలు వాంఛనీయం కాదన్నారు. దేశం అనేక సమస్యలతో కునారిల్లుతుంటే ఎన్నికల నిర్వహణ పేరిట ప్రభుత్వాలు రాజకీయ హంగామా చేయడం ఎంతమాత్రం సమంజసం కాదన్నారు. 150 కోట్ల భారత ప్రజల భవిష్యత్తుతో రాజకీయ పక్షాలు ప్రయోగాలు చేయాలనుకోవడాన్ని వేదిక తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ప్రధాన కార్యదర్శి శంకరయ్య మాట్లాడుతూ జమిలి ఎన్నికల పేరిట జాతీయ పార్టీలు, ప్రాంతీయ పార్టీల మనుగడను ప్రశ్నార్థకం చేయనున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం పలు తీర్మానాలను చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యులు హైదర్‌వలీ, స్వతంత్రబాబు, అభ్యుదయ వేదిక నాయకులు పాల్గొన్నారు.

జీవనశైలిలో మనోవిజ్ఞానశాస్త్రానికి ప్రాధాన్యం



వర్కుషాపులో మాట్లాడుతున్న సైకాలజీ విభాగాధిపతి డాక్టర్ కె. లలిత

వైవీయూ : ప్రజల ఆరోగ్యకరమైన జీవన విధానంలో మనోవిజ్ఞానశాస్త్ర ప్రాధాన్యత ఎంతో ఉందని వైవీయూ మనోవిజ్ఞాన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ కె. లలిత పేర్కొన్నారు. వైవీయూ సైకాలజీ, అడ్వాన్స్‌డ్ సైకలాజికల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో 'ఆత్మహత్యల నివారణలో మానసిక నిపుణులు' అన్న అంశంపై వర్కుషాపు రెండోరోజు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షోపన్యాసం చేసిన డాక్టర్ లలిత మాట్లాడుతూ జీవితంలో వచ్చే కష్టసుఖాలు, ఎత్తుపల్లాలను సమానంగా స్వీకరించేలా పిల్లల్లో అలవాటు చేయాలన్నారు. ప్రముఖ సైకియాట్రిస్ట్ ఇండ్ల రామసుబ్బారెడ్డి వర్చువల్ విధానంలో మాట్లాడుతూ మానసిక వ్యాధులు ఉన్నవారు ఆత్మహత్యలవైపు వెళ్లడం లేదన్నారు. ఆరోగ్యంగా చలాకీగా ఉన్న వ్యక్తులే క్షణికావేశంలో ఆత్మహత్య నిర్ణయం తీసుకుని తనువు చాలిస్తున్నారన్నారు. పిల్లలకు ఇష్టమైన రంగాలను గుర్తించి, అందులోనే రాణించేలా తర్ఫీదు ఇవ్వాలన్నారు. సమగ్రశిక్ష అభియాన్ ప్రాజెక్టు ఆఫీసర్ ప్రభాకర్‌రెడ్డి జీవనవిధానం, ఆహారపు అలవాట్ల గురించి అవగాహన కల్పించారు. విజయవాడకు చెందిన క్లినికల్ సైకాలజిస్టు ఝాన్సీరాణి, శివగంగ మాట్లాడుతూ పిల్లల ప్రవర్తనలు, మానసిక సమస్యలు, కేస్‌స్టడీ వైద్యం తదితర అంశాలపై విశ్లేషించారు.

సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసిన పార్టీ నాయకులు



వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డితో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, నేతలు

బద్వేలు అర్బన్ : పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాలులో ఆదివారం జరిగిన ఓ వివాహానికి కుటుంబ సమేతంగా హాజరై స్థానిక ఎన్‌జీవో కాలనీలోని ఓ ప్రైవేటు అతిథిగృహంలో ఉన్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డిని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలతో పాటు పలువురు పార్టీ ముఖ్యనేతలు కలిశారు. ఈ సందర్భంగా ఆయన ప్రతిఒక్కరిని పేరుపేరున పలుకరించారు. మరో 8 నెలల్లో ఎన్నికలు రాబోతున్న తరుణంలో పార్టీ నాయకులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు క్రియాశీలకంగా వ్యవహరించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, ఆడా చైర్మన్ గురుమోహన్, నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి, సివిల్‌సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ సుందర్‌రామిరెడ్డి, గిద్దలూరు అసెంబ్లీ ఎన్నికల పరిశీలకులు బంగారు శీనయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి యద్దారెడ్డి, జెడ్పీటీసీ పోలిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ గోపాలస్వామి, రూరల్ కన్వీనర్ పెద్ద పోలిరెడ్డి, కౌన్సిలర్లు ఓబుల్‌రెడ్డి, సత్యం, వార్డు ఇన్‌చార్జిలు పుత్తాశ్రీరాములు, కేశవరెడ్డి, శివయ్య, రమేష్‌బాబు, చెన్నకృష్ణారెడ్డి, నారాయణరెడ్డి, శంకర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు వికలాంగుడికి పింఛన్ మంజూరు



పింఛన్ అందుకుంటున్న వికలాంగ యువకుడు కిరణ్‌కుమార్

గోపవరం : మండలంలోని సూరేపల్లెకు చెందిన కుందేటి కిరణ్‌కుమార్ పుట్టుకతోనే వికలాంగుడు. అయినప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి పింఛన్‌కు నోచుకోలేదు. 2020లో వైఎస్సార్ పింఛన్ కానుక కింద దరఖాస్తు చేసుకున్నాడు. అప్పట్లో వైద్యులు శాశ్వత సదరన్ సర్టిఫికెట్ ఇవ్వకపోవడంతో వికలాంగుడికి పింఛన్ మంజూరు కాలేదు. బ్రాహ్మణపల్లె సచివాలయంలో పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోగా ప్రతిసారి రిజెక్ట్ అవుతుంది. తిరిగి సదరన్ సర్టిఫికెట్ పొందాలంటే ముందు తీసుకున్న సదరన్ సర్టిఫికెట్‌ను రిజెక్ట్ చేయాల్సి ఉంది. కానీ అది రిజెక్ట్ కాకపోవడంతో పింఛన్‌కు నోచుకోలేదు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సుధ ఆ గ్రామానికి వెళ్లినప్పుడు వికలాంగుడి తల్లి పింఛన్ మంజూరు చేయాలని ఎమ్మెల్యేకు మొరపెట్టుకుంది. సంబంధిత డాక్టర్లతో మాట్లాడి తిరిగి సదరన్ సర్టిఫికెట్‌ను మంజూరు చేయాలని ఆమె ఆదేశించారు. ఆ మేరకు ముందు ఇచ్చిన సదరన్ సర్టిఫికెట్‌ను రద్దు చేసి తిరిగి కొత్తగా సర్టిఫికెట్ ఇవ్వడంతో స్థానిక సచివాలయంలో దరఖాస్తు చేసుకున్న అనంతరం సెప్టెంబర్ నెలకు పింఛన్ మంజూరైంది. సచివాలయ కన్వీనర్ పుల్లయ్య, వలంటీర్ ఓబులేసు వికలాంగుడి ఇంటికి వెళ్లి పింఛన్ అందజేయడంతో వికలాంగుడి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. కాగా 21 సంవత్సరాలు వయస్సు కలిగిన వికలాంగుడు కిరణ్‌కుమార్‌కు ఇప్పటి వరకు ఎలాంటి పింఛన్ మంజూరు కాలేదు. చిన్నవయస్సులోనే తండ్రి చనిపోవడంతో తల్లే కూలీ పనులకు వెళుతూ చూసుకుంటూ ఉండేది. ఎట్టకేలకు వైఎస్సార్ పింఛన్ కానుక మంజూరు కావడంతో తల్లికి కొంత ఊరట లభించింది.

కనుల పండువగా దసరా ఉత్సవాలు



మాట్లాడుతున్న ఆర్యవైశ్యసభ అధ్యక్షుడు బుశెట్టి రాంమోహన్‌రావు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీవాసవి కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో దసరా ఉత్సవాలను కనుల పండువగా నిర్వహిస్తామని ఆర్యవైశ్యసభ అధ్యక్షుడు బుశెట్టి రాంమోహన్‌రావు తెలిపారు. ఆదివారం శ్రీవాసవి కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో ఆర్యవైశ్యసభ 133వ వార్షిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యుల సహాయంతో ఆలయంలో దసరా ఉత్సవాలను 9 రోజులపాటు అత్యంత వైభవంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆర్యవైశ్యసభ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత హోమియో వైద్యశాలను ఎక్కువ మంది ప్రజలు ఉపయోగించుకునేలా కృషి చేస్తామని తెలిపారు. సమావేశంలో ఆర్యవైశ్యసభ ఉపాధ్యక్షుడు జొన్నలగడ్డ రవీంద్రబాబు, కార్యదర్శి మురికి నాగేశ్వరరావు, జాయింట్ సెక్రటరీ సుబ్రహ్మణ్యం, కోశాధికారి మిట్టా శంకర్, సీవీ సురేష్, ఆర్యవైశ్య సభ సభ్యులు, ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

వేగంగా స్మార్ట్ స్ట్రీట్ పనులు





స్మార్ట్ స్ట్రీట్ పనులను పర్యవేక్షిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్లు పాతకోట బంగారు మునిరెడ్డి, ఆయిల్ మిల్ ఖాజా, ముమ్మరంగా సాగుతున్న స్మార్ట్ స్ట్రీట్ పనులు

ప్రొద్దుటూరు : పట్టణ పరిధిలోని మైదుకూరు రోడ్డులో స్మార్ట్ స్ట్రీట్ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర హోంశాఖ మంత్రి తానేటి వనిత, పట్టణాభివృద్ధి శాఖమంత్రి ఆదిమూలపు సురేష్ ఈ పనులకు జూలై 20న శంకుస్థాపన చేశారు. తొలి విడతగా రూ.కోటి 83 లక్షలతో రోడ్డు విస్తరణతో పాటు ఫుట్‌పాత్ పనులు చేపడుతున్నారు. మొత్తం పనుల నిర్వహణకు రూ.4కోట్లు వరకు ఖర్చయ్యే అవకాశం ఉందని అంచనా. పనుల్లో జాప్యం లేకుండా రాత్రింబవళ్లు కాంట్రాక్టర్ పనులు చేపడుతున్నారు. స్మార్ట్ స్ట్రీట్ పనులు పూర్తయితే మైదుకూరు రోడ్డు సుందరంగా మారనుంది. రోడ్డు విస్తరణ, ఫుట్‌పాత్‌ల నిర్మాణం, మధ్యలో నూతన సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేయనున్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు పాతకోట బంగారు మునిరెడ్డి, ఆయిల్ మిల్ ఖాజా తరచూ పనులను పర్యవేక్షిస్తూ వేగంగా పనులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. వ్యాపారులకు ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతో పనులు త్వరగా పూర్తయ్యేలా వేగవంతంగా చేస్తున్నారు.

• సగిలేరుకు వరదనీరు



శనివారం రాత్రి నంద్యాల అడవుల్లో కురిసిన భారీ వర్షానికి సగిలేరుకు వరదనీరు చేరి ఉధృతంగా ప్రవహిస్తోంది. వర్షాభావ పరిస్థితుల కారణంగా సగిలేరు నీరు లేక వెలవెలబోయింది. అక్కడక్కడ గుంతల్లో మాత్రం నీరు ఉండేది. ఈ సమయంలో శనివారం రాత్రి వరదనీరు రావడంతో సగిలేరు నీటిలో కళకళలాడుతోంది. దీంతో సగిలేరు కింద సాగు చేసిన పంటలు బాగా పండుతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ వర్షంతో మినుము పంట దెబ్బతింది. సగిలేరులో వరదనీరు రావడంతో చూసేందుకు అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. – కలసపాడు